రెచ్చగొడుతున్న బంగ్లా!

- చైనా, పాక్‌తో కలిసి 'భారత వ్యతిరేక ఫ్రంట్' దిశగా అడుగులు
- ఈశాన్య రాష్ట్రాలపై యూనస్ మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు
- బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, ఏడు ఈశాన్య రాష్ట్రాలకు సమీకృత ఆర్థిక ప్రణాళిక ఉండాలంటూ ప్రతిపాదన
- బంగ్లా మతగురువు అబ్దుల్ ఫారుఖీ విద్వేష ప్రకటనలు
- కోల్‌కతాకు సూసైడ్ బాంబర్లను పంపుతామని వ్యాఖ్య

> పాక్‌తో కాల్పుల విరమణ తర్వాత మోదీ ప్రభుత్వ దౌత్య వైఫల్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలోనే చైనా, బంగ్లాదేశ్ చర్యలు కేంద్ర ప్రభుత్వాన్ని మరింత చిక్కుల్లోకి నెడుతున్నాయి. ఇప్పటికే పాకిస్థాన్, చైనా తరుచూ కవ్వింపులకు పాల్పడుతుండగా, తాజాగా ఈ జాబితాలోకి బంగ్లాదేశ్ వచ్చి చేరింది. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నది. మూడు దేశాలు కలిసి భారత్ వ్యతిరేక కూటమి ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు.. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు పూర్తిస్థాయిలో చల్లబడకముందే చైనా మరోసారి కవ్వింపులకు దిగింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల పేర్లను మార్చినట్టు ప్రకటించింది. ఈ పరిణామాలను తేలిగ్గా తీసుకోవద్దని, మోదీ ప్రభుత్వానికి ఒక హెచ్చరిక వంటివని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

బంగ్లా ప్రభుత్వ సలహాదారు యూనస్ | పాక్ ప్రధాని షెహబాజ్ | చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

న్యూఢిలీ: భారత్‌కు వ్యతిరేకంగా పొరుగు దేశాలు ఏకం అవుతున్నాయా?.. ఇప్పటికే పాకిస్థాన్ నేరుగా యుద్ధానికి కాలుదువ్వుతుంటే, చైనా తరుచూ కవ్వింపులకు పాల్పడుతున్నది. ఇప్పుడు బంగ్లాదేశ్ తెరమీదికి వచ్చింది. కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నది. పాక్, చైనా, బంగ్లాదేశ్ కలిసి జట్టుగా ఏర్పడి మన దేశాన్ని ఇబ్బంది పెట్టేందుకు పావులు కదుపుతున్నట్టు విశ్లేషకులు చెప్తున్నారు. ఇప్పటికే చైనా, పాకిస్థాన్ కలిసి కశ్మీర్‌లో ఇబ్బందులు పెడుతున్న సంగతి తెలిసిందే. తాజాగా వాటి దృష్టి ఇప్పుడు ఈశాన్య రాష్ట్రాల మీద పడినట్టు చెప్తున్నారు. ఇందుకు బంగ్లాదేశ్‌ను పావుగా వాడుకుంటున్నారని పేర్కొంటున్నారు. ఇందుకు తాజాగా బంగ్లాదేశ్ ప్రభుత్వ సలహాదారు మహ్మద్ యూనస్ చేసిన వ్యాఖ్యలను ఉదహరిస్తున్నారు. బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, ఏడు ఈశాన్య రాష్ట్రాలకు (సెవన్ సిస్టర్స్) కలిపి ఒక సమీకృత ఆర్థిక ప్రణాళిక ఉండాలని వ్యాఖ్యానించారు. జల విద్యుత్తు, వైద్యం, రవాణా సదుపాయాల్లో కలిసి పనిచేయాలన్నారు. అయితే.. భారత ప్రభుత్వాన్ని సంప్రదించకుండా, భారత దేశం పేరెత్తకుండా కేవలం ఈశాన్య రాష్ట్రాలను మాత్రమే ప్రస్తావించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. యూనస్ గతంలో చైనా పర్యటనలో ఉన్నప్పుడు సైతం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈశాన్య భారతదేశంలోని సెవన్ సిస్టర్స్ భూ పరివేష్టిత రాష్ట్రాలని (ల్యాండ్ లాక్డ్), వాటికి సముద్రంతో ఎలాంటి అనుసంధానం లేదన్నారు. కాబట్టి సముద్రానికి బంగ్లాదేశ్ మాత్రమే ఏకైక కాపలాదారుగా పేర్కొన్నారు. తాము చైనాతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఏడు రాష్ట్రాలను భూ పరివేష్టిత రాష్ట్రాలని నొక్కి చెప్పడం, వాటికి సమీపంలో ఉన్న ఏకైక సముద్ర తీరం తమదేనని చైనాలో చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటని అప్పుడే విమర్శలు వెల్లువెత్తాయి. ఆ ప్రకటనను, తాజాగా చేసిన ప్రకటనను కలిపి చూస్తే.. భారత్‌కు వ్యతిరేకంగా పాక్, చైనా, బంగ్లాదేశ్ కలిపి ఒక కూటమిగా ఏర్పడుతున్నట్టు కనిపిస్తున్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. బంగ్లాదేశ్ ఇప్పటికే రాజకీయ అస్థిరత, మత విద్వేషం, అంతర్గత పోరుతో రగిలిపోతున్నది. ఆర్థికంగా దిగజారిపోయింది. ఈ పరిస్థితిని చైనా, పాక్ తమకు అనుకూలంగా మలుచుకుంటున్నాయని చెప్తున్నారు. ఇప్పటికే బంగ్లాదేశ్ సైన్యాధ్యక్షుడిని తొలగించేందుకు పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ ప్రయత్నిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.

భారత్‌పై దాడి చేస్తా..

బంగ్లాదేశ్‌కు చెందిన మతగురువు మౌలానా అబ్దుల్ ఖుద్దూస్ ఫారుఖీ తాజాగా మన దేశంపై విద్వేష వ్యాఖ్యలు చేశారు. ఏకంగా పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాపై ఆత్మాహుతి దాడులు చేస్తానని ప్రకటించారు. తన యూట్యూబ్ చానల్‌లో ఈ నెల 8న విడుదల చేసిన వీడియోలో 'కోల్‌కతాను స్వాధీనం చేసుకోవాలని బంగ్లాదేశ్ సైన్యం నన్ను ఆదేశిస్తే నేను పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తా. 70 ఫైటర్ జెట్లు కాదు కనీసం ఏడు ఫైటర్ జెట్లను కూడా వాడను. నేను సూసైడ్ బాంబర్లను పంపి కోల్‌కతాను స్వాధీనం చేసుకుంటా' అని వ్యాఖ్యానించారు. 'ముందు చావు.. తర్వాత చంపు' అనే తాలిబాన్ తరహా విధానాన్ని తాను ఉపయోగిస్తానన్నారు. ఇప్పటికే బంగ్లాలోని ఇస్లామిస్ట్ గ్రూప్‌లకు పాక్ ఐఎస్ఐ నిధులు అందిస్తున్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అందుకే ఈ మధ్య భారత్‌తో సరిహద్దు ప్రాంతాల్లో చొరబాట్లు పెరుగుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో తరుచూ అల్లర్లు జరుగుతున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. తాజాగా ఫారుఖీ చేసిన వ్యాఖ్యలు ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చుతున్నాయని చెప్తున్నారు. పాక్ తరహాలో బంగ్లాదేశ్‌లోనూ తీవ్రవాద సంస్థలను తయారుచేసేందుకు ఐఎస్ఐ ప్రయత్నిస్తున్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

కవ్విస్తున్న చైనా!

అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు పేర్లు మార్పు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు పూర్తిగా చల్లారక ముందే చైనా కొత్త మంట పెట్టింది. అరుణాచల్ ప్రదేశ్ విషయంలో మరోమారు కవ్వింపులకు పాల్పడింది. అరుణాచల్‌లోని పలు ప్రాంతాలను టిబెట్ దక్షిణ ప్రాంతానికి చెందినదిగా (జంగ్నన్) పేర్కొన్నది. పలు ప్రాంతాల పేర్లను మారుస్తున్నట్టు ప్రకటించి తన వక్రబుద్ధిని మరోసారి బయటపెట్టింది. దీంతో చైనా వైఖరిపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పేర్లు మార్చినంత మాత్రాన వాస్తవాలను ఎవరూ మార్చలేరని మండిపడింది. 'భారత్‌లోని అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో పలు ప్రాంతాలకు కొత్త పేర్లు పెట్టడానికి చైనా పనికిరాని, విఫల ప్రయత్నాలు చేస్తున్నట్టు మేం గమనించాం. ఇది భారత వైఖరికి విరుద్ధం. ఇలాంటి ప్రయత్నాలను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నాం. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగం. దీన్ని భారత్ నుంచి ఎవరూ విడదీయలేరు. పేర్లు మార్చినంత మాత్రాన ఈ వాస్తవాన్ని మార్చలేరు' అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ స్పందించారు. కాగా అరుణాచల్‌పై చైనా కవ్వింపులు కొత్తేంకాదు. 2017లో అరుణాచల్‌లోని ఆరు ప్రాంతాల పేర్లను మార్చుతూ చైనా జాబితా విడుదల చేసింది. 2021లో 15 ప్రాంతాలకు, 2023లో 11 ప్రాంతాలకు, 2024లో ఏకంగా 30 ప్రాంతాల పేర్లను మార్చుతూ జాబితా వెలువరించింది.

పాక్ భయంతో ఇండ్లకు వెళ్లకుండా యూరీలోని ఓ షెల్టర్‌లోనే తలదాచుకొన్న కుటుంబాలు

బంకర్లు నిర్మిస్తేనే వస్తాం

- ఎప్పుడేం జరుగుతుందో దిక్కు తెలియని పరిస్థితి
- డ్రోన్ దాడులతో సర్వస్వం కోల్పోయామన్న బాధితులు
- పిల్లల భవిష్యత్తు ఏంటో అర్థమవ్వట్లేదు
- మునుపటి జీవితం సాధ్యం కాకపోవచ్చు
- కశ్మీర్‌లో సరిహద్దు గ్రామ ప్రజల ఆవేదన

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): 'కాల్పుల విరమణ' ఒప్పందం కుదిరినప్పటికీ జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతాల్లోని వందలాది గ్రామాల ప్రజలు తమ స్వస్థలాలకు తిరిగి రావడానికి జంకుతున్నారు. 'కాల్పుల విరమణ' జరిగినప్పటికీ పాకిస్థాన్‌ను నమ్మడానికి లేదని, ఏ క్షణమైనా దాడులు జరుగొచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా సంస్థ ఏఎఫ్‌పీతో తమ ఆవేదనను పంచుకొన్నారు. ప్రజలు తిరిగి సొంతూళ్లకు రాకపోవడంతో పలు గ్రామాల్లో ఇండ్లు, దుకాణాలు మూతబడి రహదారులన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి.

అప్పుడే వస్తాం

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత సైన్యం పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పింది. దీంతో సరిహద్దుల్లోని ఉరి, పూంఛ్, రాజౌరీ, అక్నూర్ తదితర ప్రాంతాల్లోని గ్రామాలకు చెందిన వందలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాల్పుల ఒప్పందం కుదరడంతో స్వస్థలాలకు రావొచ్చని గ్రామస్థులకు అధికారులు సూచించారు. అయితే, కాల్పుల విరమణ ప్రకటన జరిగిన రోజే పాక్ డ్రోన్ దాడులకు తెగబడిందని, ఇలాంటి సమయంలో భార్య, పిల్లలతో ఊళ్లలోకి ఎలా వస్తామని? పాక్‌ను నమ్మే పరిస్థితి ఇప్పుడు లేదని పలువురు తేల్చి చెప్తున్నారు. ప్రభుత్వం అవసరమైన బంకర్లను ఏర్పాటు చేస్తేనే వస్తామని మరికొందరు డిమాండ్ చేస్తున్నారు.

బాగానే ఉందని వచ్చాం.. అయితే

'కాల్పుల విరమణ జరిగిందని నాకు నమ్మకం కుదరట్లేదు. మా ఊరికి వెళ్లాలని కూడా నాకు లేదు. అక్కడికి వెళ్లినప్పటికీ.. ముందులా నేను రోజూ షాప్‌ను తెరవలేను కదా. మొత్తంగా నా జీవనాధారాన్ని కోల్పోయా' అని కృష్ణలాల్ అనే టైలర్ పేర్కొన్నారు. 'కాల్పుల విరమణ ఒప్పందం' జరుగగానే అంతా బాగానే ఉందని భావించి మేమంతా ఇండ్లకు వెళ్లాం. అయితే, వాస్తవ పరిస్థితి అలా లేదు. దీంతో మళ్లీ వెనక్కి వచ్చేశాం. ప్రభుత్వం అవసరమైనన్ని బంకర్లు ఏర్పాటు చేయాలి. లేకపోతే, ఎవరూ స్వస్థలాలకు రాలేరు. పాక్‌ను నమ్మే పరిస్థితి అస్సలు లేదు' అని నౌషెరాకు చెందిన అక్షయ్ కుమార్ అనే వ్యక్తి పేర్కొన్నారు. 'పాక్ దాడులతో సర్వస్వం కోల్పోయాం. మా పిల్లల భవిష్యత్తు ఏంటో అర్థమవ్వట్లేదు. ఏదేమైనా.. మునుపటి జీవితం తిరిగి సాధ్యంకాకపోవచ్చు' అని ఉరికి చెందిన ఓ దుకాణదారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇండ్లను పునర్నిర్మిస్తాం: ఒమర్ అబ్దుల్లా

ఎల్వోసీ వెంబడి పాక్ రేంజర్లు జరిపిన షెల్లింగ్‌లో ధ్వంసమైన ఇండ్లను పునర్నిర్మించడానికి అవసరమైన సాయాన్ని ప్రభుత్వం తరపున అందిస్తామని జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. వ్యక్తిగత బంకర్లను నిర్మించాలన్న డిమాండ్లు వస్తున్నాయని, ఈ విషయాన్ని కేంద్రంతో చర్చిస్తానని తెలిపారు. ఈ మేరకు బుధవారం బారాముల్లా జిల్లాలో పర్యటించిన ఆయన ఇండ్లు కోల్పోయిన బాధితులను పరామర్శించారు.

బీఎస్ఎఫ్ జవాన్‌ను అప్పగించిన పాక్

పొరపాటున సరిహద్దు దాటిన పూర్ణం కుమార్ షా

న్యూఢిల్లీ, మే 14: గత నెలలో పొరపాటున అంతర్జాతీయ సరిహద్దును దాటి పాకిస్థాన్‌లోకి ప్రవేశించిన సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) జవాన్ పూర్ణం కుమార్ షాను పాకిస్థాన్ బుధవారం భారత్‌కు అప్పగించింది. పూర్ణం కుమార్ షాను అమృత్‌సర్‌లోని అటారీ చెక్ పోస్టు వద్ద భారత అధికారులకు అప్పగించారు. అప్పగింత ప్రశాంతంగా, నిబంధనల ప్రకారం జరిగిందని బీఎస్ఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో విధులు నిర్వహిస్తున్న 40 ఏళ్ల పూర్ణం కుమార్ షా జమ్ము కశ్మీరులోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన మరుసటి రోజున పొరపాటున సరిహద్దును దాటి పాకిస్థాన్ సరిహద్దుల్లోకి ప్రవేశించారు. పహల్గాం ఘటనతో పూర్ణం కుమార్ షా అప్పగింత ఆలస్యమైంది.

జైశంకర్‌కు భద్రత పెంపు

న్యూఢిల్లీ: భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో విదేశాంగ మంత్రి జైశంకర్‌కు భద్రత పెంచారు. ఆయన కాన్వాయ్‌లో మరో రెండు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను వినియోగించాలని కేంద్రం నిర్ణయించింది. పహల్గాం ఘటన అనంతరం భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొనడంతో ఇటీవల జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఒక అధికారి తెలిపారు. జైశంకర్‌కు గతంలో వై క్యాటగిరీ భద్రత ఉండగా, 2023 నుంచి జడ్ క్యాటగిరీ భద్రత కల్పిస్తున్నారు.

డ్రోన్లను నాశనం చేసే 'భార్గవాస్త్ర' విజయవంతంగా పరీక్షించిన భారత్

న్యూఢిల్లీ, మే 14: దేశ సరిహద్దుల వద్ద భద్రతాపరమైన సవాళ్లు ఎదురవుతున్న వేళ భారత్ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన డ్రోన్ల విధ్వంసక వ్యవస్థ 'భార్గవాస్త్ర'ను విజయవంతంగా పరీక్షించింది. చాలా తక్కువ ఖర్చుతో సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (ఎస్‌డీఎఎల్) రూపొందించిన ఈ వ్యవస్థను ఒడిశాలోని సీవార్డ్ ఫైరింగ్ రేంజ్‌లో పరీక్షించారు. ఈ పరీక్షలో 'భార్గవాస్త్ర'లోని మైక్రో రాకెట్లు నిర్దేశిత లక్ష్యాలన్నింటినీ అధిగమించినట్టు ఆర్మీ ఎయిర్ డిఫెన్స్‌అధికారులు తెలిపారు. ఈ వ్యవస్థ 2.5 కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్న శత్రు దేశాల డ్రోన్లను గుర్తించి, మైక్రో రాకెట్లతో నిర్వీర్యం చేయగలదు.

మసూద్ అజర్‌కు పాక్ రూ.14 కోట్ల పరిహారం?

ఇస్లామాబాద్: అమెరికాతో పాటు చైనా బ్లాక్‌లిస్టులో పెట్టిన ఉగ్రవాది, జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజర్‌కు పాకిస్థాన్ ప్రధాని రూ.14 కోట్ల పరిహారం ఆఫర్ చేసినట్టుగా తెలుస్తున్నది. భారత్ ఇటీవల జరిపిన వైమానిక దాడుల్లో మసూద్ అజర్ కుటుంబానికి చెందిన 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున రూ.14 కోట్లు అందించినట్టు సమాచారం. ఆ కుటుంబసభ్యుల చట్టబద్ధమైన వారసులకు ఈ పరిహారం అందిస్తామని పాక్ ప్రకటించింది. బాధితులకు ఇండ్లు కట్టిస్తామని తెలిపింది.

పారాదీప్ పోర్ట్‌లో నౌక కలకలం

పారదీప్ : పాకిస్థాన్‌కు చెందిన 21 మంది నావికా సిబ్బంది ఉన్న ఒక నౌక ఒడిశాలోని పారాదీప్ పోర్ట్‌కు చేరుకుంది. దీంతో పోలీసులు అప్రమత్తమై పారదీప్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. దక్షిణ కొరియా నుంచి వయా సింగపూర్ మీదుగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు క్రూడ్ అయిల్‌ను తీసుకు వచ్చిన 'ఎంటీ సైరన్ 2' వాణిజ్య నౌకలో మొత్తం 25 మంది నావికా సిబ్బంది ఉండగా, అందులో 21 మంది పాకిస్థానీయులు కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. క్రూడాయిల్‌ను అన్‌లోడ్ చేసే వరకు సిబ్బంది ఎవరూ నౌకను వదిలి వెళ్లరాదంటూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం సీఐఎస్ఎఫ్ గస్తీ తిరుగుతూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నది.

లక్ష్మణరేఖ దాటారు

మోదీని పొగిడిన థరూర్‌పై కాంగ్రెస్ ఆగ్రహం

న్యూఢిల్లీ, మే 14: ఆపరేషన్ సిందూర్‌పైన, తదనంతర కాల్పుల విరమణ ప్రకటనలపైన పార్టీ వైఖరిని పక్కన పెట్టి 'లక్ష్మణ రేఖ'ను దాటిన పార్టీ ఎంపీ, సీనియర్ నాయకుడు శశి థరూర్‌పై కాంగ్రెస్ అధిష్టానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శశి థరూర్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఆయన వ్యక్తిగతమని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. సొంత అభిప్రాయాలను వ్యక్తీకరించకుండా, పార్టీ వైఖరికి కట్టుబడి ఉండాల్సిన సమయం ఆసన్నమైందని థరూర్‌ను కటువుగా హెచ్చరించింది. భారత్, పాకిస్థాన్ మధ్య సైనిక ఘర్షణలను నిలువరించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటన చేయడంతోసహా సంబంధిత పరిణామాలను చర్చించేందుకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుధవారం నాడిక్కడ సమావేశమయ్యారు. పార్టీ వైఖరికి భిన్నంగా శశి థరూర్ ప్రకటనలు చేయడం పట్ల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి(కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జైరాం రమేష్‌ను ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా శశి థరూర్ చేస్తున్న ప్రకటనల గురించి ప్రశ్నించగా అవి థరూర్ వ్యక్తిగత అభిప్రాయాలని వ్యాఖ్యానించారు.

యువతను సైన్యంలోకి ఈడ్చుకెళ్తున్న ఉక్రెయిన్: పుతిన్

మాస్కో: ఉక్రెయిన్ ప్రభుత్వం సైనిక నియామకాలకు అనుసరిస్తున్న విధానాన్ని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రంగా ఎండగట్టారు. 'కీవ్‌లో అధికారులు బలవంతంగా సైనిక సమీకరణ జరపాలంటే, ప్రజలను వీధి కుక్కల మాదిరిగా పట్టుకుని, ఈడ్చుకెళ్తారు. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో ఇలా 30,000 మందిని తీసుకెళ్లారు. కానీ, రష్యాలో అలా కాదు. ప్రజలే స్వచ్ఛందంగా వస్తారు. దాదాపు 60,000 మంది ముందుకొచ్చారు' అని తెలిపారు. సైన్యంలోకి వచ్చే విధంగా భయపెట్టడం కన్నా, స్వచ్ఛందంగా వచ్చి, సైన్యంలో చేరే విధంగా ఆకర్షించడాన్నే రష్యా నమ్ముతుందని చెప్పారు. సైన్యంలో చేరే వలంటీర్ల సంఖ్య రష్యాలో పెరుగుతున్నదన్నారు.



ఉగ్రవాదానికి భారత సైన్యం దీటైన జవాబు

రాష్ట్రపతి ముర్ము అభినందనలు.. సీడీఎస్, త్రివిధ దళాల అధిపతులతో భేటీ

న్యూఢిల్లీ, మే 14: ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం.. ఉగ్రవాదానికి దీటైన సమాధానం చెప్పిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. ఈ విజయానికి కారణమైన సైనికుల ధైర్యం, అంకితభావం అభినందనీయమని కొనియాడారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో చీఫ్‌ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. సమావేశంలో ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠి పాల్గొన్నారు.

చాలా మంచి పని చేశా

భారత్, పాక్ కాల్పుల విరమణపై మరోసారి ట్రంప్ కీలక వ్యాఖ్యలు

న్యూయార్క్, మే 14: భారత్, పాకిస్థాన్ మధ్య జరుగుతున్న సైనిక ఘర్షణలలో తన ప్రభుత్వం జోక్యం చేసుకుందన్న తన ప్రకటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. జరుగుతున్న పరిణామాలు తనకు నచ్చలేదని, ప్రశాంతంగా ఉండి వాణిజ్య ఒప్పందాలు చేసుకుందామని ఆ రెండు దేశాలకు నచ్చ చెప్పి చాలా మంచి పని చేశానని ట్రంప్ వ్యాఖ్యానించారు. అణు యుద్ధానికి దారితీయగల పరిస్థితులు అతి తక్కువ కాలంలో ఏర్పడడం తాను గతంలో ఎన్నడూ చూడలేదని ఆయన అన్నారు. ఆ రెండు దేశాల వద్ద అణ్వస్త్రాలు ఉన్నాయని, అణు యుద్ధం ప్రారంభమైతే అది చిన్నపాటిదైనా దాని పర్యవసానాలు చాలా దారుణంగా ఉంటాయని, లక్షల మంది మరణిస్తారని ఆయన చెప్పారు. అందుకే తాను కల్పించుకోవలసిన అవసరం ఉందని తాను భావించానని ట్రంప్ తెలిపారు.

రాఫెల్ నడపగా లేంది.. లీగల్ బ్రాంచ్‌లో పనిచేయలేరా?

- మహిళలకు ఆ పోస్టులు ఇవ్వరా?
- కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 14: భారత వైమానిక దళంలోని ఒక మహిళ రాఫెల్ ఫైటర్ జెట్‌ను అవలీలగా నడపగలిగినప్పుడు ఆర్మీలోని జడ్జి అడ్వకేట్ జనరల్ (లీగల్) శాఖలోని లింగ తటస్థ పోస్టుల్లో మహిళా అధికారులు ఎందుకు తక్కువ ఉన్నారని సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. 50-50 ఎంపిక ప్రమాణంపై కేంద్రం హేతుబద్ధతను కోర్టు ప్రశ్నించింది. మహిళలకు కేటాయించిన పోస్టులు తక్కువగా ఉండటం వల్ల తోటి పురుష అధికారుల కన్నా మెరుగ్గా వరుసగా 4, 5 ర్యాంకులు సాధించినప్పటికీ జడ్జి అడ్వకేట్ జనరల్ (జేఏజీ) శాఖ లీగల్ విభాగంలో తమను ఎంపిక చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ ఇద్దరు మహిళా అధికారులు అర్షీనూర్ కైర్, ఆస్థా త్యాగీలు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్‌లు దీపాంకర్ దత్తా, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. 'ఒక మహిళ రాఫెల్ విమానాన్ని నడిపినట్టు పత్రికల్లో వచ్చిందని, ఆ యుద్ధంలో ఆమెను యుద్ధ ఖైదీగా పట్టుకునే అవకాశం కూడా ఉంది. అలాంటి పరిస్థితుల్లో కూడా ఒక మహిళకు ఆ బాధ్యతలు నిర్వహించడానికి భారత వైమానిక దళం అనుమతి ఇస్తున్నప్పుడు ఆర్మీలోని జేఏజీ శాఖలో మహిళలను తీసుకోవడం ఎందుకు కష్టమవుతుంది' అంటూ అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటిని జస్టిస్ దీపాంకర్ దత్తా ప్రశ్నించారు. 10 మంది మహిళలను జేఏజీకి అర్హత సాధిస్తే వారందరినీ జేఏజీ బ్రాంచ్‌లో అధికారులుగా నియమిస్తారా అన్న విషయాన్ని జస్టిస్ మన్మోహన్ పరిశీలించారు. అనంతరం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్టు ప్రకటించారు.

ఆ మంత్రిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

కర్నల్ సోఫియాపై అనుచిత వ్యాఖ్యలపై హైకోర్టు ఆదేశం

జబల్‌పూర్, మే 14: కర్నల్ సోఫియా ఖురేషీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి విజయ్ షాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మధ్యప్రదేశ్ హైకోర్టు బుధవారం ఆదేశించింది. అసభ్యకరమైన, దిగజారుడు భాషను ఉపయోగించినందుకు మంత్రిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ దేశంలో ఇంకా నిజాయితీ, క్రమశిక్షణ, త్యాగం, నిస్వార్థం, వ్యక్తిత్వం, అసమాన ధైర్య పరాక్రమాలు ఉన్న చివరి వ్యవస్థగా సాయుధ దళాలను హైకోర్టు అభివర్ణించింది. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారతీయ సాయుధ దళాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన వివరాలను రక్షణ కార్యదర్శి విక్రం మిస్రీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌తో కలసి కర్నల్ సోఫియా ఖురేషీ విలేకరుల సమావేశాలు నిర్వహించారు. "ఉగ్రవాదుల సోదరి"గా సోఫియా ఖురేషీని వర్ణించేందుకు ప్రయత్నిస్తూ బీజేపీకి చెందిన గిరిజన వ్యవహారాల మంత్రి విజయ్ షా ఆమెపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలను సుమోటోగా విచారణకు స్వీకరించిన హైకోర్టు మంత్రిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది. బుధవారం సాయంత్రం 6 గంటల్లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కూడా పోలీసు శాఖను కోర్టు ఆదేశించింది. కేసు తదుపరి విచారణను గురువారం ఉదయం 10.30కి కోర్టు వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, కర్నల్ సోఫియా ఖురేషీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మంత్రి విజయ్ షాను ఎందుకు బర్తరఫ్ చేయలేదని ప్రధాని నరేంద్ర మోదీని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి(కమ్యూనికేషన్ల ఇన్‌చార్జి) జైరాం రమేశ్ ప్రశ్నించారు. మంత్రి అభ్యంతరకర వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా ఖండించింది.

సింధూ జలాలు వదలండి

భారత్‌కు పాకిస్థాన్ లేఖ

న్యూఢిలీ, : సింధూ జలాల నిలిపివేతపై తీసుకున్న నిర్ణయాన్ని పునః పరిశీలన చేయాలంటూ పాకిస్థాన్ జల వనరుల మంత్రిత్వ శాఖ భారత్‌కు విజ్ఞప్తి చేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సింధూ జలాల నిలిపివేత కారణంగా తమ దేశంలో నీటి సంక్షోభం ఏర్పడుతుందని భారత విదేశాంగ శాఖకు ఆ దేశ జల వనరుల శాఖ ఒక లేఖ రాసింది. ఈ విషయంలో తన నిర్ణయాన్ని మార్చుకుని, యథావిధిగా పాక్‌కు నీటిని వదలాలని కోరింది. కాగా, సింధూ జలాలు పాక్‌కు చేరకుండా భారత్ ఇప్పటికే స్వల్ప, మధ్య, దీర్ఘకాల ప్రణాళికలను ప్రకటించింది.

పాక్‌కు మరో 8,738 కోట్లు

భారత్ వ్యతిరేకిస్తున్నా.. ఐఎంఎఫ్ నిధుల విడుదల

ఇస్లామాబాద్, మే 14: మోదీ ప్రభుత్వం విజ్ఞప్తులను అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) పట్టించుకోలేదు. ఉగ్రవాద